ఉప్పల్‌లో హీటెక్కుతున్న రాజకీయం..

పోటాపోటీగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల ప్రెస్‌మీట్స్


ఉప్పల్ ఆదర్శ్‌నగర్ విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

ఉప్పల్: ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఉప్పల్‌లో రాజకీయం హీటెక్కుతోంది. ఉప్పల్‌లో కేటీఆర్ పర్యటనతో ప్రారంభమైన రాజకీయ వేడి రోజురోజుకో రూపం దాలుస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు గురువారం పోటాపోటీగా ప్రెస్‌మీట్ నిర్వహించి ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకున్నారు.

కేటీఆర్‌ను విమర్శించే స్థాయి పరమేశ్వర్‌రెడ్డికి లేదు– బీఆర్‌ఎస్

ఉప్పల్: రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డికి లేదని ఉప్పల్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేముల సంతోష్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఉప్పల్ ఆదర్శ్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డివిజన్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేటీఆర్ ఉప్పల్‌కు వచ్చి వరాల జల్లు కురిపిస్తే ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు స్పందన వస్తుంటే తట్టుకోవడం లేదని విమర్శించారు. ఉప్పల్‌కు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఇక్కడి ప్రజలకు తెలుసన్నారు. మంత్రి కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిపై సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా మేసేజ్‌లు పెడుతున్నారని ఆరోపించారు. డివిజన్ సమస్యలపై దృష్టి పెట్టలేని పరమేశ్వర్‌రెడ్డి కేటీఆర్‌ను గానీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిపై నిందలు వేస్తే సహించేది లేదని, తీరు మారకపోతే డివిజన్‌లో తిరగనివ్వబోమని, భరోసా యాత్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. పనిలో పనిగా బీజేపీ నాయకుల ఆరోపణలను కూడా ఖండించారు. బీఆర్‌ఎస్ నాయకులు మస్క సుధాకర్, దాసరి వీరేష్, అనితారెడ్డి, వేముల వెంకటేష్, సత్యపాల్‌రెడ్డి, హేమలత, నాయబు వెంకటేష్, రాజు, అరిటికాయల వంశీ, చిలుకూరి శ్రీకాంత్, సల్ల శ్రీకాంత్‌రెడ్డి, మంజుల, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు


ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

నాటి నుంచి నేటి వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మించి పేదలను అక్కున చేర్చుకున్న పార్టీ కాంగ్రెస్ అని, అలాంటి పార్టీని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నేతలకు లేదని ఉప్పల్ కాంగ్రెస్ నేతలు, డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, కొంపల్లి బాలరాజు అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధు ప్రకటిస్తే బీఆర్‌ఎస్ నేతలు ముఠాగా ఏర్పడి దళితులకు చేరనివ్వకుండా మింగేస్తున్నారని ఆరోపించారు. గల్లీతో సంబంధం లేని బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని, ఉప్పల్ సర్కిల్ ఏ– బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని మండిపడ్డారు. ఈ మేరకు ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఆగడాలతోనే ఉప్పల్ డివిజన్‌లో డిపాజిట్ కూడా దక్కించుకోలేని పరిస్థితి నెలకొందని వారు విమర్శించారు. సమావేశంలో లింగంపల్లి రామకృష్ణ, కంది శ్రవణ్‌రెడ్డి, ఆరుణ్, సుశీల, మంచాల రఘు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్లు వేయాలని వినతి


ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న కాలనీవాసులు

హబ్సిగూడ: ఏఎస్‌రావునగర్ డివిజన్ శ్రీనివాసనగర్ హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని, కాలనీలో పురాతన పైపులైన్లు మార్చాలని, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గురువారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, మోహన్, సాంబయ్య, ఉపేంద్రచారి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఓంప్రకాష్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ట్రాఫిక్ సీఐ బదిలీ

మల్కాజిగిరి: మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.సుధీర్ కృష్ణ బదిలీ అయ్యారు. రెండున్నర సంవత్సరాలుగా విధులు సమర్థవంతంగా నిర్వహించిన సుధీర్ కృష్ణ భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీకాగా ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

క్లుప్తంగా...

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీలోని 'స్పోర్ట్స్ ఎరినా బాక్స్ క్రికెట్' అకాడమీని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రికెట్ అకాడమీలతో యువకుల్లో ఐక్యతాభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు యాసిన్, హరీష్, ప్రతాప్, కార్తీక్, స్థానిక నేతలు పీఆర్.ప్రవీణ్, దయాకర్ రెడ్డి, గణేష్, కటర్ల శేఖర్‌బాబు, భానుచంద్రరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

పేదవిద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రామంతాపూర్: నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ జన్మదినం సందర్భంగా బహుమతులుగా వచ్చిన నోట్‌బుక్స్‌ను గురువారం మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు రామంతాపూర్‌లోని నెహ్రూనగర్‌లో పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేతలకు ప్రజాప్రతినిధులకు సత్కారం చేసి శాలువా పూల దండలకు బదులుగా నోట్‌పుస్తకాలు బహుమతులుగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, ఆలే రమేష్, మధుసూధన్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతుల సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ తదితరులు

రామంతాపూర్: కుషాయిగూడ నాగారంలో వచ్చేనెల 2వ తేదీన మున్నూరు కాపు విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే విద్యావంతుల సదస్సు పోస్టర్‌ను గురువారం రామంతాపూర్‌లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత స్థానంలో ఉన్న విద్యావంతులు సమాజంలోని పేద విద్యార్థుల చదువులకు సహాయ పడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బండారు వెంకట్‌రావు, సత్యనారాయణ, ఉమాకాంత్, ఆడెం రమేష్, జగదీష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా బీఎల్‌ఆర్ ట్రస్టు



కుషాయిగూడ: ఆపదలో ఉన్న పేదలకు బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందని ట్రస్టు ప్రతినిధి బీఆర్‌ఎస్ నేత గుమ్మడి జంపాల్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, మంగపురం కాలనీకి చెందిన హనుమంతు కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. పూస రమేష్, నాదెండ్ల నవీన్, నరేష్ ముదిరాజ్, అశోక్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనాథ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి



కుషాయిగూడ: తెలంగాణ ఉద్యమ నాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అకాల మృతిపట్ల మాజీ మేయర్ బొంతు రాంమోహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయిచంద్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటని, తెలంగాణ గొంతు మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ సాయిచంద్ మృతదేహానికి నివాళులర్పించి ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


గడప గడప కార్యక్రమంలో నేతలు

బోడుప్పల్: ప్రధాన మంత్రి మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం బోడుప్పల్ నార్త్ అశోక్‌నగర్‌లో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సీనియర్ సిటిజన్స్‌కు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాసాల నర్సింగ్‌రావు, బోడుప్పల్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రతినిధులు ఏనుగుల లక్ష్మయ్య, కరుణాకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎదుగుదల ఓర్వలేకే.. ఆరోపణలు..



మేడిపల్లి: ప్లాట్ కబ్జా చేశానని, తనపై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత బైటింటి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పర్వతాపూర్ సర్వే నెంబర్ 20లోని ప్లాట్ నెంబర్ ఈ–211 నెంబర్ కలిగిన ప్లాట్ 320 గజాల స్థలాన్ని శ్రీరమణ కో ఆపరేటివ్ సొసైటీ డాక్యుమెంట్ 1989 ద్వారా న్యాయబద్ధంగానే కొనుగోలు చేశానన్నారు. దీనికి 1992లో గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోగా 2014లో శ్రీనివాస్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడని అనంతరం అతడి నుంచి నేను 2016వ సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని, 2019 నుంచి విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. 2020వ సంవత్సరంలో మున్సిపల్ నుంచి ఇంటి నంబర్‌ను సైతం పొందానన్నారు. ఇప్పుడు సొసైటీ అధ్యక్షుడు మల్లారెడ్డి ప్రోద్బలంతో తన ప్లాట్ అంటూ కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తూ తనపై కుట్రలు చేస్తున్నారని, తన భార్య కార్పొరేటర్ కావడంతో తనపై కుట్రలు చేస్తున్నారన్నారు. కేసును కోర్టులో న్యాయపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. సొసైటీ పేరుతో జరిగే అక్రమాలను త్వరలోనే బయటపెడతా అన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కె.ధీరజ్‌రెడ్డి, కాలనీవాసులు ముత్యంరెడ్డి, మనోహర్‌రెడ్డి, రంగారెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో నిఘా నేత్రం కీలకం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ జానకి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని మల్కాజిగిరి డీసీపీ జానకి అన్నారు. గురువారం నాచారం డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయిబాబా దేవాలయంలో ఏర్పాటు చేసిన 23 సీసీ కెమెరాలను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి డీసీపీ జానకీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమన్నారు. ముఖ్యమైన కేసుల్లో నిఘా నేత్రాలు నేర పరిశోధనలో కీలకంగా మారుతూ నిందితులను పట్టిస్తున్నాయని తెలిపారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా అందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ పి.నరేశ్‌రెడ్డి, నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, సలహాదారులు నర్సింహ, దామోదర్‌రెడ్డి, హరికృష్ణ, బీఆర్‌ఎస్ నేతలు విఠల్ యాదవ్, బుచ్చన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులను పునః ప్రారంభించాలి


ఆర్టీసీ బస్సులను పునః ప్రారంభించాలని ఆందోళన చేస్తున్న దృశ్యం

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్, చర్చి కాలనీ, కేసీఆర్‌నగర్ తదితర ప్రాంతాలకు బస్సులను వెంటనే పునరుద్ధరించాలని ఉప్పల్ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ నేతలు గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనాకు ముందు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రామంతాపూర్‌లోని అంతర్గత బస్తీలకు ఆర్టీసీ బస్సులు వచ్చేవని, ఆ తర్వాత ఆర్టీసీ అధికారులు వాటిని తిరిగి పునరుద్ధరించలేదని అన్నారు. దీంతో స్థానికులు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రధాన రహదారి బస్టాండ్ వరకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. వారం రోజుల్లో బస్సులను పునరుద్ధరించకపోతే ఉప్పల్ డిపో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు గంధమల్ల శ్రీనివాస్‌తో పాటు బీఎస్పీ నాయకులు శీలం అనితారెడ్డి, సుదర్శన్‌గౌడ్, శ్రీహరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

అల్వాల్: అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ కృపా కాంప్లెక్స్ వద్ద కరెంట్ వస్తువుల మరమ్మతుల దుకాణం నిర్వహిస్తున్న కె.గణేష్(86) అనుమానస్పద స్థితిలో పనిచేసే చోటే మృతి చెందాడు. గురువారం ఉదయం దుకాణంలో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దుకాణం షటర్ తెరిచి చూడగా గణేష్ మృతదేహం కనిపించింది. గుండె పోటుతో మూడు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. గణేష్ పనిచేసే షాపులోనే నివాసం ఉంటున్నాడని రాత్రి సమయంలో ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తమ్ముడు శ్రీహరి తమకు ఎవరిపైనా అనుమానం లేదని పోలీసులకు తెలిపారు.

నిమిషాంబిక ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు


అమ్మవారి దర్శనంలో భక్తులు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబిక దేవి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీసీతారామచంద్ర స్వామి వార్లకు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ వెల్లడించారు. ఈ నెల 30వ తేదీన ఆషాడమాసం రెండో శుక్రవారం రోజున నిమిషాంబికదేవి అమ్మవారిని శాకాంబరీదేవిగా విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, కుంకుమార్చన బ్రాహ్మణోత్తములచే వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అమ్మవారి దివ్య దర్శనం, మహా మంగళ హారతి, నీరాజనం మంత్రపుష్పం ఆశీర్వచనంలో భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారి అలంకరణను తిలకించి, భోజన తాంబూలాదులను స్వీకరించాలని ఆయన కోరారు.

ఘనంగా తొలి ఏకాదశి

పవిత్ర ఆషాఢమాసంలో వచ్చే హిందువుల తొలి పండుగైన తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలను మామిడి తోరణాలు, అరటి బోదెలు, పూల తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయంలోని దేవి, దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.


ఆనంద్‌బాగ్ వెంకటేశ్వరస్వామి మూలవిరాట్


గౌతంనగర్‌లోని వెంకటేశ్వర ఆలయంలో..


రామంతాపూర్ సత్యదేవుని ఆలయంలో..


అల్వాల్ బాలాజీ ఆలయంలో..


జగన్నాథ ఆలయం వద్ద భక్తులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్


అల్వాల్‌లో ఈద్గాలో..

త్యాగానికి ప్రతీకైన బక్రీద్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం మజీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గొర్రెలు, మేకలు కోసి పేదలకు పంచారు. ముస్లింలు తమ బంధువులకు స్తోమతను బట్టి దానాలు చేశారు. కులమతాలకు అతీతంగా అందరూ ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.


బక్రీద్ విశిష్టతను చెబుతున్న మత గురువు అబ్దుల్ వసీం


రామంతాపూర్‌లో..


ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో షేక్ మాదర్ వలీ తదితరులు


చిలుకానగర్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రవీణ్ తదితరులు



కాప్రా సర్కిల్‌లో ప్రత్యేక ప్రార్థనల్లో..